క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలను పెంచే విధంగా బోధన సాగాలని ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని దావాజిపల్లి, మాందాపూర్ ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. దీంతో పాటు ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులను పరిశీలించారు. నిబంధనల మేరకు అన్ని వసతులను ఏర్పాటు చేయాలని వారు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

కవర్లలో సారవంతమైన మట్టి నింపాలి



పాన్‌గల్: మొక్కల పెంపకానికి కవర్లల్లో సారవంతమైన మట్టిని నింపాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని దొండాయిపల్లి పంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి మట్టి, కవర్లను పరిశీలించారు. కవర్లలో నింపే మట్టిని జల్లెడ పట్టి నింపాలన్నారు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలకు పాదులు తీసి క్రమం తప్పకుండా నీటిని పట్టాలని ఆదేశించారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య 50కి తగ్గకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అవసరం



అమరచింత: వసతిగృహంలో చదువుకుంటున్న విద్యార్థులు క్రమశిక్షణతో పాటు చదువులో రాణించి వసతి గృహానికి పేరు తీసుకురావాలని ఎస్సీ వసతి గృహ వార్డెన్ బెనర్జీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉలెన్ రగ్గు, జామెటరీ బాక్స్, స్పోర్ట్స్ షూ, సాక్స్, ఎగ్జామ్ ప్యాడ్, పెన్సిల్, ఎరెసర్, క్యారమ్‌బోర్డ్, చెస్‌బోర్డ్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు సమకూర్చుతుందన్నారు. చలికాలంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉలెన్ రగ్గులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ట్యూటర్స్ సిద్దిక్, ప్రవీణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గం కక్షిదారులకు వరం



కొల్లాపూర్: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్‌అదాలత్ ద్వారా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని ఇది కక్షిదారులకు వరంగా మారిందని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఆర్‌వీఎస్ఎస్ మిదున్‌తేజ అన్నారు. బుధవారం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ న్యాయసేవల గూర్చి వివరించారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి లోక్‌అదాలత్‌లో ఉచితంగా న్యాయసేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వసంతరెడ్డి, శ్రీనివాసరావు, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, ఆర్. కురుమూర్తి తదితరులున్నారు.

చెక్‌డ్యాం పరిశీలన

చిన్నచింతకుంట: మండలంలోని ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను అధికారులు బుధవారం పరిశీలించారు. చెక్‌డ్యాంతో గ్రామ ప్రజలకు సమస్యలు తలెత్తుతున్నాయని తొలగించాలని ఈనెల 2న కురుమూర్తికి వచ్చిన కలెక్టర్ రవినాయక్‌కు బీజేపీ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ ఈఈ ప్రతాప్‌సింగ్, ఆర్ అండ్‌బీ ఈఈ స్వామి చెక్‌డ్యాంను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. కలెక్టరు ఆదేశానుసారం చర్యలు చేపడుతామని తెలిపారు. వారి వెంట తహసీల్దార్ కృష్ణయ్య, సీఐ రామకృష్ణ, ఎస్ఐ శేఖర్ తదితరులు ఉన్నారు.



కూలి అందక అవస్థలు

- ఉపాధి కూలీలకు నాలుగు నెలలుగా అందని డబ్బులు
- టెక్నికల్ సమస్య వల్లే ఇబ్బందులంటున్న అధికారులు
- కుటుంబ పోషణ భారం అవుతోందని ఆందోళన



గోపాల్‌పేట శివారులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

గోపాల్‌పేట: రెక్కాడితే కాని డొక్కాడని పేదలకు ఉపాధి పనులు, పొలం లేక రోజువారీ కూలీ చేసుకుంటేనే డబ్బులు వస్తాయి. ఆ డబ్బుతోనే కుటుంబాలను పోషించుకునే ఉపాధి కూలీలకు నాలుగు నెలలుగా పనిచేసిన కూలి డబ్బులు రావడం లేదు. ఎప్పుడు అకౌంట్‌లో డబ్బులు పడుతాయోనని ప్రతిరోజు ఎదురు చూపులే దక్కుతున్నాయి. దీపావళి పండుగ సమీపిస్తుండటంతో కనీస ఖర్చులకు సైతం ఇబ్బందులు పడుతున్నామని కూలీలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు సైతం కూలీలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. చేసిన పనికి డబ్బులు ఇవ్వకుంటే కుటుంబ పోషణ ఎలా సాగించాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

గోపాల్‌పేట మండలంలో పదిహేను గ్రామ పంచాయతీలు ఉండగా.. చిన్న గ్రామ పంచాయతీల్లో ఎనిమిది నుంచి పది మంది వరకు, పెద్ద పంచాయతీల్లో పది నుంచి ఇరవై మంది వరకు ఉపాధి కూలీ పనులు చేస్తున్నారు. వీరు పంచాయతీ పరిధిలో పల్లెప్రకృతి వనాల్లో కలుపు, చెత్త తీసి మొక్కలకు నీరు పట్టడం, రోడ్ల వెంట ఉన్న చెట్లకు పాదులు తీసి వాటి రక్షణ, వాటరింగ్ చేయడం వంటి పనులు చేస్తుండగా.. సుమారు రోజువారీ కూలి రూ.200 వస్తుందన్నారు. కానీ జులై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల డబ్బులు కూలీలు అకౌంట్లలో జమ కాలేదు. గోపాల్‌పేట మండలంలో సుమారు రెండు వందల మంది పనిచేయగా.. రూ.పది లక్షల వరకు రావాల్సి ఉంది. అలాగే రేవల్లి మండలంలో మూడు వందల మంది వరకు పనిచేయగా వారికి సైతం డబ్బులు అందలేదు.

పండుగకు డబ్బులు లేవు



నేను వాచర్‌గా పని చేస్తున్నా. చేసిన పనులకు నాలుగు నెలలుగా కూలి డబ్బులు రావడం లేదు. దీనిపై అధికారులను అడిగినా సమాధానం రావట్లేదు. దీపావళి పండుగ వరకైనా ఖాతాల్లో డబ్బులు జమచేయాలి

– బిద్ది, కేశంపేట పాతతండా, రేవల్లి మండలం

తప్పని ఎదురుచూపు



ఎప్పుడైనా నెల లేదా రెండు నెలల్లో డబ్బులు వచ్చేవి. కానీ నాలుగు నెలలుగా డబ్బులు రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది. అధికారులను అడిగితే అప్పుడుఇప్పుడు అని కాలయాపన చేస్తున్నారు తప్పితే సమస్య పరిష్కారం కావట్లేదు.

– మందడి తిరుమలయ్య, వాచర్, గోపాల్‌పేట

పది రోజుల్లో జమ చేస్తాం



ఉపాధి కూలీలకు నాలుగు నెలలుగా డబ్బులు రానిమాట వాస్తవమే. సమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లాం. టెక్నికల్ సమస్య వల్ల డబ్బులు పడేందుకు ఆలస్యం అయింది. వారం, పది రోజుల్లో డబ్బులు కూలీల ఖాతాలో వేస్తాం. కూలీలు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

– నరేందర్, ఏపీఓ, గోపాల్‌పేట

గెలుపు కోసం కలిసి కట్టుగా పనిచేయాలి



కోడేరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సోదరి ఉమ



ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. వీపనగండ్ల మండలంలోని పుల్గర్‌చర్ల ఉప సర్పంచ్ నరేష్‌తో పాటు పలువురు నాయకులు, పాన్‌గల్ మండలంలోని జమ్మాపూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అందుతున్నాయని, అవి కొనసాగాలంటే మరోమారు బీఆర్ఎస్‌కు అధికారం ఇవ్వాలని కోరారు. అలాగే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మద్దతుగా ఆయన తల్లి బిచ్చమ్మ కొల్లాపూర్ పట్టణంలో, భార్య విజయ చిన్నంబావి మండలంలో, సోదరీమణులు ఉమ, వీణ కోడేరు మండలంలో, నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త రంగినేని అభిలాష్‌రావు పాన్‌గల్ మండలంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరోసారి హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే కొల్లాపూర్ ప్రగతి పథంలో దూసుపోతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, సోమ్‌నాథ్‌నాయక్, చంద్రశేఖర్‌నాయక్, రామ్మూర్తినాయుడు, దామోదర్‌రెడ్డి, శేఖర్, మదన్‌మోహన్‌గౌడు, రాముయాదవ్, ఎద్దుల సురేందర్‌రెడ్డి, కోదండం, తిరుపతయ్య, గాలన్న, బొజ్జన్న పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే శిక్షణ



మదనాపురం కస్తూర్బా పాఠశాలలో కరాటే శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

మదనాపురం: విద్యార్థుల ఆత్మరక్షణ కోసం ప్రభుత్వం కరాటే శిక్షణ తరగతులను నిర్వహిస్తుందని మదనాపురం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఎస్ఓ రేణుక అన్నారు. బుధవారం మదనాపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలోనే కొన్నూర్, గోపాల్‌పేట కస్తుర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క బాలిక కరాటే శిక్షణ పొంది ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే కరాటే శిక్షణ తరగతులను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు.

అందరికీ సంక్షేమం

ఆత్మకూర్: ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మక్తల్ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి పద్మజారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని వార్డుల్లో మక్తల్ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్‌ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మి నాయకులు శివశంకర్, ఆనంద్, చిన్ననర్సింహ, విష్ణురెడ్డి, నాగేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి మరోసారి గెలిపించండి

ఖిల్లాఘనపురం: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి మంత్రి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని కమాలోద్దీన్‌పూర్‌లో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆమె గ్రామంలో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిందని కొనియాడారు. మంత్రి కుమార్తెలు డాక్టర్ ప్రత్యూష, తేజస్వినితో పాటు ఎంపీపీ కృష్ణానాయక్, రాష్ట్ర ఆయిల్‌ఫాం సలహా మండలి సభ్యుడు లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు బాలీశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణానికి చెందిన జక్కుల గిరయ్యాయాదవ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి బుధవారం మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, బీచుపల్లి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కమాలోద్దీన్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న సింగిరెడ్డి వాసంతి

బీఆర్ఎస్‌లో చేరికలు

పెబ్బేరు మండలంలోని కొత్త సూగూరుకు చెందిన వివిధ పార్టీలకు చెందిన 80 మంది నాయకులు సర్పంచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తిలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

వీపనగండ్ల: గ్రామాల్లోని బీఎల్‌ఓలు ఎన్నికల నిబంధనలను అనుసరించి పని చేయాలని తహసీల్దార్ వరలక్ష్మి బీఎల్‌ఓలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఓటర్ లిస్టుల తయారీ, అర్హులైన వారిని ఓటర్ జాబితాలో చేర్పించడం వంటి అంశాలను క్షేత్రస్థాయి పరిశీలన చేసుకొని తుది జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు.

అవినీతిపై పోరాటం

వనపర్తి టౌన్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని వల్లభ్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేయించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో రమేష్ గౌడ్, మధుసూదన్ గౌడ్, చంద్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కొత్తకోట: పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్, టీడీపీలకు చెందిన 500మంది ముస్లింలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి దేవరకద్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రశాంత్, కృష్ణారెడ్డి, గొల్లబాబు, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డితో పాటుగా పలువురు నాయకులు, దొంతికుంట తండాకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు చందర్‌తో పాటుగా పలువురు నాయకులు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మేఘారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

పాన్‌గల్: మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి, ఆకునోనిపల్లి, మాధరావుపల్లి గ్రామాల్లో కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డా.కేతూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని మేడేపల్లిలో మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 60 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వాకిటి శ్రీహరిని గెలిపించాలని కోరారు.

పుస్తకాల పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని గాంధీ హైస్కూల్‌లో 8 వతరగతి చదువుతున్న విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఎంట్రెన్స్ పుస్తకాలను అందజేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 8 వతరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ అర్హత కోసం ప్రతి ఏడాది పరీక్ష నిర్వహిస్తుందన్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి నాలుగు సంవత్సరాల పాటు, ప్రతి నెలా రూ.1000 చొప్పున ఉపకార వేతనం అందిస్తుందన్నారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు పతంజలి శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు అర్థం శ్రీనివాసులుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



ఎస్సీ వర్గీకరణతోనే భవిష్యత్

గోపాల్‌పేట: ఎస్సీ ఉపకులాల వర్గీకరణతోనే అభివృద్ధికి అవకాశం ఉంటుందని ఎమ్మార్పీఎస్ ఉపకులాల రాష్ట్ర కార్యదర్శి గట్టుస్వామి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీ సమీపంలో మండల కన్వీనర్ శాన్‌మాదిగ, బేడబుడగ జంగాల హక్కుల పోరాట సమితి వనపర్తి జిల్లా సీనియర్ నాయకుడు కోడిగంటి మన్యంతో కలిసి నవంబర్ 11న జరిగే మహాసభను విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 11న ఎస్సీ ఉపకులాలు కూలీలకు వెళ్లకుండా మందకృష్ణ మాదిగ మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గట్టయ్యమాదిగ, తగుల వెంకటస్వామి, ఏడవలి భాస్కర్, గణేష్, వెంకటేష్, బేడబుడగసంగం మహిళలు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఆత్మకూర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని కోరుతూ నవంబర్ 11న హైదరాబాద్‌లో తలపెట్టిన విశ్వరూప మహాసభకు జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్రకార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోషన్న, నాయకులు దండు శ్రీను, అజ్జపాగ మాసన్న, కట్టెలమిషన్ రాజు, గాలిపంపు శ్రీను, కర్రె శ్రీను, జానకీరాం, సోంబాబు, బోరెల్లి రాము, రేవల్లి శ్రీను, రామకృష్ణ, రవి, అజయ్ తదితరులు ఉన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుడు తార్‌నాయక్‌కు నివాళి



బుసిరెడ్డిపల్లిలో ఉపాధ్యాయుడికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు తార్‌నాయక్‌కు అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామస్తులు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాము నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు తరగతులు బహిష్కరించి బస్టాండ్ చౌరస్తాలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సీఐటీయూ నాయకులు మానవహారంగా ఏర్పడి కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, సీఐటీయూ నాయకులు, ఎస్ఎంసీ చైర్మన్ కుర్మయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పామిరెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సీఈఓ జగదీశ్వర్‌రెడ్డి



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈఓ నరేష్‌కుమార్ ప్రారంభించారు. గ్రేడ్ 1 రకానికి మద్దతు ధర రూ.2, 203, గ్రేడ్2 ధాన్యానికి రూ.2, 183 ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు తమ పంటలను దళారులకు తక్కువ ధరకు అమ్ముకోకుండా నేరుగా కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సీఈఓ జగదీశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని దళారులకు అమ్మితే నష్టపోతారన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203 ధర నిర్ణయించారని, రైతు పాస్‌బుక్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ ఇవ్వాలన్నారు.

ఉక్కపోతతో విద్యార్థినుల ఇబ్బందులు



తరగతి గదిలో కిటికీని లాక్ చేసిన దృశ్యం

అమరచింత: ఎన్నికల నిర్వహణలో భాగంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసిన అధికారులు తరగతి గదుల కిటికీలను మూసి ఉంచడంతో విద్యార్థినులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో మూడు తరగతి గదులకు ఉన్న కిటికీలను పూర్తిగా డెకోలం షీట్లతో మూసేశారు. దీంతో తరగతి గదిలోకి గాలి, వెలుతురు రాకపోవడంతో విద్యార్థినులు గదిలో చదువుకోలేక వరండాల్లో చదువుకుంటున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ పేరిట ముందస్తుగానే తరగతి గదులను లాక్ చేయడంతో విద్యార్థుల చదువులకు అంతరాయం కలుగుతుందని కిటికీలు లాక్ చేయకుండా తెరవడం, మూయడం వంటి పనులు చేయమని మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా స్పందించడం లేదన్నారు. అధికారులు స్పందించి తమ విద్యార్థినులకు ఉక్కపోత కలుగకుండా, చదువులకు ఆటంకం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

బిజినేపల్లి: బీరసాగులో ఆధునిక పద్ధతులు అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డా.ఆదిశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని ఖానాపూర్‌లో బీరసాగులో సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఆదిశంకర్ మాట్లాడుతూ రైతులు మెలైన బీర రకాలను ఎంపిక చేసుకోవాలని, బీర తీగ ఏర్పడే సమయంలో పందిరి ఏర్పాటు, డ్రిప్‌తో నీటి తడులు, ఎరువుల పంపిణీ, మల్చింగ్ వంటి పద్ధతులు పాటించాలన్నారు. దీంతో పెట్టుబడి ఖర్చులు తగ్గి, దిగుబడి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.శైల, రైతులు పాల్గొన్నారు.

పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి

పంటలలో చీడ పీడల నివారణ కోసం పిచికారి చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని పాలెం కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ శైల సూచించారు. బుధవారం పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో క్రిమి సంహారణ మందుల పిచికారి సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శైల రైతులు మాస్క్, తలకు షీల్డ్, టోపి, చేతికి తొడుగులు, బూట్లు తప్పక ధరించాలని ప్రదర్శన ద్వారా సూచించారు. రసాయన డబ్బాలను వాడిన తర్వాత రోడ్లపై పారవేయకుండా భూమిలో పాతిపెట్టాలన్నారు. డబ్బాలను చెరువులలో, నీటి ప్రవహించే ప్రాంతాల్లో వేయరాదన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఆదిశంకర్, రైతులు పాల్గొన్నారు.